

## యువతను కాపాడుకుందాం

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్
- గంజాయి రహిత నగరంగా మారుద్దాం..
- ఇసుక అక్రమ రవాణా, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

05

## మేడారంలో మంత్రుల పర్యటన

- వనదేవతలను దర్శించుకుని అభివృద్ధి పనుల పరిశీలన

05




సంపుటి :03 | సంచిక :28 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

శనివారం 28, ఫిబ్రవరి 2026




## భూభారతి కాదు.. అది భూ 'హారతి'

- నిషేధిత జాబితాలో కోటి ఎకరాల భూమి
- 'కొలువుల కొట్లాట' మహా ధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు

02

## కడియంపై అనర్హత వేటు ఖాయమేనా?



- స్పీకర్ ఎదుట హాజరైన ఎమ్మెల్యే
- ఇరుపక్షాలా క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి
- మరికొద్దిరోజుల్లో స్పీకర్ తుది తీర్పు
- స్పీకర్ తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ


02

# రన్ వే... షార్ట్

వరంగల్ మామునూరు విమానాశ్రయంపై ఈ ప్రాంతవాసులు గంపెడంత ఆశలు పెట్టుకున్నారు. సత్వరం పనులు పూర్తయితే ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పొరుగు జిల్లాలవాసులు కూడా ఎయిర్‌పోర్ట్ సేవలను వినియోగించుకోనున్నారు. అలాంటి ప్రతిష్ఠాత్మక ఎయిర్ పోర్ట్ పనులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. రన్ వే పొడవును కేవలం 2.5 కిలోమీటర్లకు కుదించడం చర్చనీయాంశమైంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 3.9 కిలోమీటర్ల పొడవైన రన్ వేను ప్రతిపాదించగా, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఆ పొడవును తగ్గించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా పెద్ద విమానాలు ల్యాండ్ అవ్వాలంటే కనీసం 2.9 కిలోమీటర్ల రన్‌వే ఉండాలి. అలాంటిది మామునూర్ ఎయిర్‌పోర్ట్ రన్ వే 2.5 కి.మీకే పరిమితం చేయడం వెనుక ఆంతర్యం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

– అక్షరదర్బార్, వరంగల్

02



అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం రన్ వే పొడవు 2.9 కి.మీ తప్పనిసరి

- మామునూరు ఎయిర్‌పోర్ట్ రన్ వే మాత్రం 2.5 కిమీ కుదింపు
- తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ఎయిర్‌పోర్ట్‌ల రన్ వే అంతకంటే ఎక్కువ
- ఒక్క ఈ ఎయిర్‌పోర్ట్ రన్ వే తగ్గించడంపై అనేక అనుమానాలు
- సత్వరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పొడవు పెంచాలని డిమాండ్

## పోస్ట్‌మార్టం రిపోర్ట్‌కు లంచం డిమాండ్

- మృతుడి కుటుంబాన్నీ వదలని హోంగార్డు
- రూ.35 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వైనం
- కీసర పోలీస్ స్టేషన్‌లో ఘటన
- నేరంతో ప్రమేయం ఉన్న డాక్టర్ కూడా అదుపులోకి..

04





# రన్ ......వే షార్ట్

- అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం రన్ వే పొడవు 2.9 కి.మీ తప్పనిసరి
- మామునూరు ఎయిర్ పోర్ట్ రన్ వే మాత్రం 2.5 కిమీ కుదింపు
- తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ఎయిర్ పోర్ట్ ల రన్ వే అంతకంటే ఎక్కువ
- ఒక్క ఈ ఎయిర్ పోర్ట్ రన్ వే తగ్గించడంపై అనేక అనుమానాలు
- సత్వరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పొడవు పెంచాలని డిమాండ్

అక్షరదర్బార్, వరంగల్ : వరంగల్ మామునూరు విమానాశ్రయంపై ఈ ప్రాంతవాసులు గంపెడంత ఆశలు పెట్టుకున్నారు. సత్వరం పనులు పూర్తయితే ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పొరుగు జిల్లాలవాసులు కూడా ఎయిర్‌పోర్ట్ సేవలను వినియోగించుకోనున్నారు. అలాంటి ప్రతిష్ఠాత్మక ఎయిర్ పోర్ట్ పనులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. రన్ వే పొడవును కేవలం 2.5 కిలోమీటర్లకు కుదించడం చర్చనీయాంశమైంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 3.9 కిలోమీటర్ల పొడవైన రన్ వేను ప్రతిపాదించగా, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఆ పొడవును తగ్గించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా పెద్ద విమానాలు ల్యాండ్ అవ్వాలంటే కనీసం 2.9 కిలోమీటర్ల రన్‌వే ఉండాలి. అలాంటిది మామునూర్ ఎయిర్‌పోర్ట్ రన్ వే 2.5 కి.మీకే పరిమితం చేయడం వెనుక ఆంతర్యం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## - ఇతర విమానాశ్రయాల రన్ వే పొడవులు

హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయ రన్ వే 3.2 కిలోమీటర్లు ఉండగా, శంషాబాద్ విమానాశ్రయ రన్ వే ఏకంగా 4.2 కిలోమీటర్లు ఉంది. పక్క రాష్ట్రంలోని విజయవాడ (గన్నవరం)లోని విమానాశ్రయ రన్‌వే పొడవు 3.36 కిలోమీటర్లు, విశాఖపట్నంలోని రన్ వే పొడవు 3.0 కిలోమీటర్లు. దీన్నిబట్టి వరగల్ ఎయిర్‌పోర్ట్ రన్‌వే కచ్చితంగా కుదించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్న రన్‌వే కాబట్టి అతిసాధారణ విమాన సర్వీసులకే విమానాశ్రయం పరిమితమవుతుందా? లేదంటే.. డొమెస్టిక్ విమాన సర్వీసులతోనే సరిపెడతారా అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

## - అంతర్జాతీయ ప్రమాణాలుండాలి

రాష్ట్రంలో ఇతర నగరాలతో పోలిస్తే, అభివృద్ధి చెందుతున్న వరంగల్ టాప్‌లో ఉంది. నగరం ఐటీ, పారిశ్రామిక రంగాల్లోనూ శరవేగంగా దూసుకుపోతోంది. ఈ తరుణంలో అంతర్జాతీయ విమాన ప్రయాణ సౌకర్యాలు ఎంతో అవసరం, ఆ కల సాకారమైనప్పుడే నగరానికి భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. కానీ ప్రస్తుత నిర్ణయం ప్రకారం కేవలం డొమెస్టిక్ విమానాలకే ఈ విమానాశ్రయం పరిమితమయ్యే ప్రమాదం ఉంది. టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్టులో కూడా 2.9 కిలోమీటర్ల రన్‌వే అవసరమని సూచించినా, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల తాజా ప్రకటనలు నిరాశ మిగిల్చాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రన్వే పొడవును పెంచాలని, అప్పుడే వరంగల్ దశ మారుతుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

## - రన్ వే పొడవు పెంచాలని డిమాండ్

ఎయిర్‌పోర్ట్ కోసం ప్రభుత్వం మొత్తం 953 ఎకరాల భూమిని సిద్ధం చేసింది. రైతుల నుంచి సేకరించిన ప్రైవేటు భూమితో పాటు ప్రభుత్వ భూమి పత్రాలను ఇప్పటికే విమానయాన శాఖకు అందజేశారు. దీంతో భూమికి సంబంధించిన అడ్డంకులన్నీ దాదాపుగా తొలగిపోయాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు వెల్లడించిన ప్రకారం 2026 జూన్ నెలలో ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టును సుమారు రూ.850 వ్యయంతో చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధమవుతోంది. వచ్చే రెండేళ్లలో విమాన రాకపోకలు ప్రారంభించడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. రన్ వే పొడవు తక్కువగా ఉన్నప్పటికీ మొదటి దశలో ప్రాంతీయ విమాన సర్వీసులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే ఈ విమానాశ్రయాన్ని పైలట్ శిక్షణ కేంద్రంగా కూడా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రక్షణ శాఖ భూములను కూడా వాడుకునేలా త్వరలోనే ఒప్పందం కుదరనుంది. వరంగల్ నగరం ఐటీ, పారిశ్రామిక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో అంతర్జాతీయ కనెక్టివిటీ చాలా కీలకం. రన్ వే పరిమితి భవిష్యత్తు విస్తరణకు అడ్డంకిగా మారకూడదని స్థానికులు కోరుతున్నారు.

# కడియంపై అనర్హత వేటు ఖాయమేనా?



- స్పీకర్ ఎదుట హాజరైన ఎమ్మెల్యే
- ఇరుపక్షాలా క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి
- మరికొద్దిరోజుల్లో స్పీకర్ తుది తీర్పు
- స్పీకర్ తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

అక్షరదర్బార్, స్టేషన్ ఘన్‌పూర్ : తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల అంశం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్‌పై విచారణ కీలక దశకు చేరుకుంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఆయనపై వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గతంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎదుట కడియం శ్రీహరి శనివారం విచారణకు హాజరయ్యారు. గత విచారణలో బీఆర్ఎస్ అద్వకేట్లను కడియం తరపు అడ్వొకేట్లు ప్రశ్నించగా , కడియం తరపు అడ్వొకేట్లను బీఆర్ఎస్ అడ్వొకేట్లను క్రాస్ ఎగ్జామింగ్ చేశారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదులు అందగా ఇప్పటికే ఎనిమిది మందికి సంబంధించిన తీర్పులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌కు సంబంధించిన పిటిషన్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. నిన్నటి విచారణకు దానం నాగేందర్ హాజరుకాకపోవడంతో ఆయన కేసును మార్చి 2వ తేదీకి వాయిదా వేశారు. ఇవాళ కడియం శ్రీహరికి సంబంధించిన విచారణ ప్రక్రియ పూర్తిగా ముగిసే అవకాశం కనిపిస్తోంది. దీనివల్ల వీరిద్దరి భవితవ్యంపై మార్చి మొదటి వారంలోనే స్పీకర్ నుంచి తుది తీర్పు వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కడియం శ్రీహరి రాజకీయ ప్రస్థానంలో ఈ విచారణ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరినప్పటి నుంచి ఆయనపై అనర్హత వేటు వేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. చట్టపరమైన ప్రక్రియలో భాగంగా ఇరుపక్షాల వాదనలను స్పీకర్ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మార్చి మొదటి వారంలో వెలువడే తీర్పు ఆధారంగానే కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవి కొనసాగుతుందా లేదా అనేది స్పష్టం కానుంది. ఈ పరిణామాలు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలతోపాటు రాష్ట్ర రాజకీయాల్లోనూ ఉత్కంఠ రేపుతున్నాయి.



# భూభారతి కాదు అది భూ 'హారతి'

- నిషేధిత జాబితాలో కోటి ఎక రాల భూమి
- ఆ భూములను కొట్టేయాలనేది సర్కార్ ప్లాన్
- రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి
- 'కొలువుల కొట్లాట' మహా ధర్నాలో మాజీ మంత్రి హరీశ్ రావు

అక్షరదర్బార్, హనుమకొండ : రాష్ట్రంలో అమలవుతున్నది భూభారతి కాదని, అది భూ 'హారతి' అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శనివారం ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. హరీష్ రావు రాకతో జనగామ, కాజీపేట ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఆయన వెంట తరలివచ్చారు. హనుమకొండ జిల్లా కాజీపేటలో నిర్వహించిన 'కొలువుల కొట్లాట' మహా ధర్నాలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి పథకం రైతులకు మేలు చేయడం లేదని, అది కేవలం భూ 'హారతి'గా మారిందని విమర్శించారు. భూభారతి పేరుతో దాదాపు కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేర్చి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై తక్షణమే 'సిట్' వేసి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్య ప్రజలు మరియు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాలపై ఉన్న పగతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని, రైతుబంధు ఇవ్వకుండా రైతుల ఉసురు పోసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి సీజన్లో నాట్లకు ముందే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవని గుర్తు చేశారు. ఇతర సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం, రైతు భరోసాకు వచ్చేసరికి ఎందుకు వెనకాడుతోందని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తన తప్పులను మీసేవ నిర్వాహకులు మరియు ఆపరేటర్లపై నెట్టి చేతులు దులుపుకోవాలని చూడటం సరి కాదని హరీష్ రావు హెచ్చరించారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్రం ఏర్పడటం వల్లే కాజీపేటకు ఈ ఫ్యాక్టరీ వచ్చిందని, స్థానిక యువతకు ఇందులో 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలోని లాతూర్ వ్యాగన్ ఫ్యాక్టరీలో 70 శాతం స్థానికులకే రిజర్వేషన్ ఇచ్చినప్పుడు, తెలంగాణలో ఎందుకు ఇవ్వడం లేదని ఆయన నిలదీశారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి వస్తే అడ్డుకుంటామని కేంద్ర మంత్రులను హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం నాడు దేవాదాయ శాఖకు చెందిన 150 ఎకరాల భూములను కోచ్ ఫ్యాక్టరీ కోసం కేటాయించిందని, కానీ నేడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు మొండిచేయి చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి నీళ్ల తరలింపును అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్తులో హైదరాబాద్‌కు తీవ్ర నీటి ఎద్దడి తప్పదని హెచ్చరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూనే, దానికి బదులుగా పురుషులకు బస్సు చార్జీలను డబుల్ చేశారని, ఇది ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాక్కోవడమేనని ఎద్దేవా చేశారు. వరంగల్ నగరంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి పునాది వేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తాను వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ పనులు వేగవంతం చేశానని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అవినీతి బయటపడుతుందనే భయంతోనే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, వినయ్ భాస్కర్ పాల్గొన్నారు.

# హైవే నిర్మాణంతో రైతులు నష్టపోవొద్దు

## తహసీల్దార్ కు వినతి పత్రం ఇచ్చిన సర్పంచ్



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా చలి వాగు సమీప రైతులకు నష్టం వాటిల్లుతుం దని వరద ఉధృతికి పంటలు నష్టపోయే ప్రమాదం ఉన్నందున రోడ్డు మరమ్మతుల పనులలో పైపులైన్లకు బదులు పిల్లర్లతో నిర్మించినట్లయితే రైతులకు నష్టం వాటిల్ల కుండా ఉంటుందని మొగుళ్ళపల్లి సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ శనివారం స్థానిక తహసీల్దార్ సునీతకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విజయ రవీందర్ మాట్లాడుతూ నేషనల్ హైవే నిర్మాణంతో రైతులకు ఎలాంటి పంట నష్టం జరగకుండా చూడాలని ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# అక్రమ ఇసుక, మట్టి నిల్వల సీజ్

## చలివాగు బ్రిడ్జి సమీపంలో రెవెన్యూ, మైనింగ్, పోలీసుల మెరుపుదాడులు



అక్షరదర్బార్, పరకాల: పరకాల పరిధిలోని పరకాల–భూపాలపల్లి ప్రధాన రహదారిపై చలివాగు బ్రిడ్జి సమీపంలో శనివారం రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల సంయుక్త బృందం మెరుపుదాడులు నిర్వహించి భారీగా అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక, మట్టి నిల్వలను స్వాధీనం చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఉదయం 10.45 గంటల ప్రాంతంలో మైనింగ్ విభాగం ప్రాజెక్టు అధికారి ఎన్. శ్రీనివాసరావు, పరకాల తహశీల్దార్ టి. విజయలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. చలివాగు బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో తోట విజయ్, నాగేశ్వరరావుకు చెందిన సుమారు 160 మెట్రిక్ టన్నుల ఇసుక, అలాగే సుమారు 300 మెట్రిక్ టన్నుల మట్టి నిల్వలను ఎటువంటి అనుమ తులు లేకుండా నిల్వ ఉంచినట్లు గుర్తించారు.అనుమతులు లేకుండా నిల్వ చేసిన ఇసుక, మట్టి నిల్వలను అక్కడికక్కడే సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో హన్మకొండ రాయల్టీ ఇన్‌స్పెక్టర్, మండల గిర్దావర్, గ్రామ పరిపాలనాధికారులు శేఖర్, సారంగపాణి, కృష్ణంరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.సీజ్ చేసిన నిల్వలను సురక్షిత ప్రదే శాలకు తరలించే ప్రక్రియను పరకాల ఆర్డీఓ డాక్టర్ కె. నారాయణ స్వయంగా పర్యవేక్షిస్తు న్నట్లు అధికారులు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక, మట్టి అక్రమ నిల్వలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అక్షర దర్బార్, శాయంపేట :శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పలు గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి – షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, స్థానిక సమస్యల పరి ష్కారంపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అధి కారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యానికి గుర్తింపునివ్వాలి

- టైలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రామగిరి యాదగిరి
- ఇనుగుర్తిలో ఘనంగా 'వరల్డ్ టైలర్స్ డే' వేడుకలు



అక్షర దర్బార్, ఇనుగుర్తి: ఇనుగుర్తి మండల కేంద్రంలో ప్రపంచ టైలర్స్ డే వేడుకలను టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షులు రామగిరి యాదగిరి సంఘం జెండాను ఆవిష్కరించి, మాట్లాడుతూ.. రాత్రింబ వళ్లు కష్టపడి సమాజానికి అందాన్ని ఇచ్చే టైలర్ల జీవితాల్లో మాత్రం చీకట్లు అలముకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టైలర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. వృత్తిని నమ్ముకున్న వారికి సబ్సిడీపై కుట్టు మిషన్లు, తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేయాలన్నారు. టైలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో మండల కమిటీ సభ్యులు, ఇనుగుర్తి, చిన్నముప్పారం గ్రామాల ప్రతినిధులు సమ్మయ్య, సూర్యనారాయణ, కేదారి, కుమార్, శ్రీరంగం, మరాఠి చంద్రయ్య, రాజు, చందర్, చంద్రమౌళి, ప్రభాకర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



# క్రషర్ బ్లాస్టింగ్ లతో భయంభయం

- ఆందోళనలో ప్రగతి సింగారం ప్రజలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామ శివారులో ఉన్న సాయిరాం క్రషర్ యాజమాన్యం రాత్రి పగలు తేడా లేకుండా బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బ్లాస్టింగ్ శబ్దాలతో భూకంపం వచ్చినట్టుగా వృద్ధులు, మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. క్రషర్ సమీ పంలోని వ్యవసాయ పొలాల్లో పనిచేస్తున్న రైతులు, కూలీలు బయటకు ఎగిరే రాళ్లు తగులుతాయేమోనన్న ఆందోళనతో భయంభయంగా పనులు సాగిస్తున్నారని పేర్కొన్నారు. బ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్లలో పగుళ్లు ఏర్పడటంతో పాటు గృహోపకరణాలు ధ్వంసమవుతున్నాయని వాపోతు న్నారు. బ్లాస్టింగ్ సమయంలో భారీ దుమ్ము, దూళి కిలోమీ టర్ల మేర వ్యాపించి ఇండ్లు, పంటపొలాలు పాడవుతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో చిందం గౌతమ్ ప్రభంజనం

- జిల్లా స్థాయిలో ఫస్ట్, రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్
- అభినందించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు




అక్షర దర్బార్, మల్హర్ : చిట్యాల మండలం బావుసింగ్ పల్లి గ్రామానికి చెందిన చిందం గౌతమ్ ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (AISSEE)–2026లో అద్భుత ప్రతిభ కనబరి చాడు. 9వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ జాతీయ స్థాయి పరీక్షలో గౌతమ్ రికార్డు స్థాయి ర్యాంకులు సాధించి గ్రామానికి, జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో చదువుతున్న గౌతమ్ మూడు స్థాయిల్లో అగ్రస్థానాలు దక్కించుకున్నాడు. జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించి జిల్లా టాపర్‌గా నిలవగా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 4వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. జాతీయ స్థాయిలో 240వ ర్యాంక్ సాధించి తన ప్రతిభను చాటాడు. చిందం భాస్కర్–హాసిని దంపతుల కుమారు డైన గౌతమ్ విజయం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల కరెస్పాండెంట్ కార్తీక్ రావు విద్యార్థిని అభినందిస్తూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో చదివితే జాతీయ స్థాయిలో రాణించగలరని గౌతమ్ నిరూపించాడని పేర్కొన్నారు.

# సేవాలాల్ బోధనలు ఆచరణీయం

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: సేవాలాల్ మహరాజ్ బోధనలు ఆచర ణీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్లో శనివారం సద్గురు సేవాలాల్ మహరాజ్ 287 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి ఆధ్యాత్మిక దారిదీపమని, ఆయన బోధనలు సమాజంలో నైతిక విలువలు, ఐక్యత, సేవాభావం పెంపొందించాయని కొనియాడారు. కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్, ఆర్డీఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# వార్డు మెంబర్లలకు ట్రైనింగ్ సర్టిఫికెట్లు అందజేత




అక్షర దర్బార్ శాయంపేట : తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శాయంపేట రైతు వేదికలో ఈనెల 24 నుంచి 28 వరకు నిర్వహించిన శిక్షణ తరగ తులు శనివారం ముగిశాయి. చివరి రోజు వార్డు మెంబర్లకు ఎగ్జామినేషన్ నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పెద్దకోడేపాక వార్డ్ మెంబర్స్ పైండ్ల సునీత, కోత్వాలు రవలిక, కోకిల శంకర్, కుక్కల గణేష్, చంద రఘుపతి, రేణికుంట్ల శివ, సుమన్, మంద సదానందం, నాగెల్లి కిషోర్, రేణికుంట్ల స్వాతి, కోకిల అరుణ, మంద మౌనిక, గోడిశాల లలిత తదితరులు పాల్గొన్నారు.



## జోష్నను పరామర్శించిన భూక్య జంపన్న

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి : హనుమకొండ లోని రక్షిత్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ప్రజాపక్షం ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆలుగొండ రమేష్ చిన్న కూతురు జోష్నను భూక్య జంపన్న శనివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న జోష్నా గత మూడేళ్లుగా హాస్టల్‌లో ఉంటూ కేయూ పరిధిలోని కళాశాలలో విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో ఉండటం వల్ల ఆహార సంబంధిత సమస్యల కారణంగా శస్త్రచికిత్స చేయాల్సి రావడం బాధాకరమని అన్నారు. విద్యార్థిని త్వరగా కోలుకుని తిరిగి చదువులు కొనసాగించాలని ఆకాంక్షించారు.



## అంగన్వాడీల్లోనే పౌష్టికాహారం

### మొగుళ్ళపల్లి సర్పంచ్ చాట్ల విజయ రవీందర్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్ లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం లభిస్తుందని మొగుళ్ళపల్లి సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ అన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత ఆధ్వర్యంలో. ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ECCE) డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మొగుళ్ళపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్ పాల్గొని మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రంలో మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం పిల్లలకు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఆట, పాట, కథ పూర్వ గణిత భావన సృజనాత్మక శాస్త్రీయ పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సెంటర్ -1టీచర్ బి. అనిత, మొగుళ్ళపల్లి గ్రామ ఉపసర్పంచ్ ఎర్రబెల్లి హిమబిందు కోటేశ్వరరావు, వార్డు మెంబర్లు. గుడిమల్ల జయసుధ రమేష్, అర్షం మహేష్, అంగన్వాడి టీచర్, బాలింతలు గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

# ఆరె కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి

### రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపల్లి శివాజీ పిలుపు

అక్షర దర్బార్, దుగ్గొండి : ఆరె కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ పిలుపుచ్చారు. దుగ్గొండి మండలం గిర్నిబావి లోని నందన గార్డెన్‌లో ఆరె కులస్తుల విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఆరెకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంగ్లీ శివాజీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపల్లి శివాజీ ముఖ్య అతిథిగా హాజరై ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆరె కులస్తులు రాజకీయాలతో పాటు విద్య, వైద్య, ఆర్థిక రంగాల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో పోటీ చేసి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల హక్కులు కోల్పోతున్నామని, ఆరె కులాన్ని ఓబీసీలో చేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ జండా రాజేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోర్తాల చందర్ రావు, ఉద్యమ కమిటీ చైర్మన్ సోమిడి అంజన్ రావు, కొడగాని నరసింహరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండెకారి రంగారావు, హింగే భుజంగర్ రావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు సుకినే రాజేశ్వర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గుండెకారి రవికుమార్, మండల అధ్యక్షుడు లాండే రమేష్, ఒలిగే నర్సింగారావు, కుసుంబా బాబురావు, ధూమాల సుధాకర్ రావు, డోలే చిన్ని,పకిడే బాబురావు, దుగ్గొండి మండల కోశాధికారి ఎడ్డే రఘుపతి రావు, సర్పంచ్ సుకినే నాగరాజు, ప్రభు, డ్యాగల సుజాత సుధాకర్ తోపాటు జిల్లా పరిధిలోని అన్ని మండలాల ఆరె కులస్తులు పాల్గొన్నారు.





### సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఒలిగే నర్సింగరావు



ఆరెకుల సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఒలిగే నర్సింగరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం దుగ్గొండి మండలం గిర్నిబావిలోని వందనా గార్డెన్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ హాజరై, రాష్ట్ర–జిల్లా నాయకుల సమక్షంలో రేకంపల్లి గ్రామానికి చెందిన ఒలిగే నర్సింగరావును జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించారు. అనంతరం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

### దుగ్గొండి మండల కమిటీ ఎన్నిక

వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇంగ్లీ శివాజీ అధ్యక్షతన గిర్నీబావిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆరే కుల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ, రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్, రాష్ట్ర రైతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు మోర్తాల చందర్ రావు, ఉద్యమ కమిటీ చైర్మన్ సోమిడి అంజనరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఓలిగే నర్సింగరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా గుండెకారి రవికుమార్, దుగ్గొండి మండల అధ్యక్షుడిగా మడతలపాటి కుమారస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుకినే రాజేశ్వర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇంగ్లీ శివాజీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు మరియు ఆరే కుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



## కళావేదిక ఏర్పాటు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : మొగుళ్ళపల్లి మండలం మొట్లపల్లి హైస్కూల్లో రూ. రెండు లక్షల పదివేల జీపీ నిధులతో విద్యార్థుల సౌకర్యార్థం కళా వేదికను నిర్మించినట్లు సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని హెడ్మాస్టర్ లింగాల కుమారస్వామి తెలిపారు.

# పోస్ట్ మార్టం రిపోర్ట్ కు లంచం డిమాండ్

- మృతుడి కుటుంబాన్నీ వదలని హోంగార్డు
- రూ.35 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వైనం
- కీసర్ పోలీస్ స్టేషన్‌లో ఘటన
- నేరంతో ప్రమేయం ఉన్న డాక్టర్ కూడా అదుపులోకి..



అక్షరదర్బార్, మేడ్చల్ : మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టు ఇప్పించేందుకు బాధిత కుటుంబాన్ని రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసిన హోంగార్డు నగేష్‌ను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తోటకూర మహేష్ అనే వ్యక్తి నాలుగు నెలల క్రితం మరణించగా ఆయన పోస్టుమార్టం నివేదిక కోసం బాధితులు మేడ్చల్ జిల్లాలోని కీసర పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో హోంగార్డు నగేష్ బాధితుల నుంచి ఏకంగా రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. గాంధీ ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్ సందీప్‌కు ఈ నగదు ఇవ్వాల్సి ఉంటుందని, అప్పుడే రిపోర్టు వస్తుందని నగేష్ నమ్మబలికాడు. చివరికి హోంగార్డుతో బాధితుడు రూ.40 వేలు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనిలో భాగంగా బాధితుడు మొదటి విడతగా రూ.5 వేలు చెల్లించాడు. రెండో విడతగా మిగిలిన రూ.35 వేలు ఇచ్చే సమయంలో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం ఏసీబీ అధికారుల సూచనల మేరకు హోంగార్డు నగేష్‌కు నగదు అందజేస్తుండగా అధికారులు మాటువేసి పట్టుకున్నారు. ఈ లంచం వ్యవహారంలో సంబంధం ఉన్న హోంగార్డు నగేష్‌తో పాటు డాక్టర్ సందీప్‌ను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది మరియు పోలీసులు అవినీతికి పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిరుపేద కుటుంబాలకు చెందిన వారు.. తమ వారి మరణ ధ్రువీకరణ పత్రాల కోసం కూడా లంచాలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి రావడం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో మరిన్ని వివరాలను సేకరించేందుకు ఏసీబీ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# రైతు భరోసా నిధులను విడుదల చేయాలి

### అడిషనల్ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించిన వరికెల కిషన్ రావు



అక్షరదర్బార్, పరకాల: హనుమకొండ: జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు అడిషనల్ కలెక్టర్ రవికి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా పథకం నిధులు విడుదల కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. పంటకాలం ప్రారంభమై సమయం గడిచినా పెట్టుబడి సాయం అందక రైతులు అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల కొనుగోలుకు తక్షణ ఆర్థిక సహాయం అవసరమని పేర్కొంటూ రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోదాటి మాధవరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# యువతను కాపాడుకుందాం

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- గంజాయి రహిత నగరంగా మారుద్దాం.. మూలాలపై దృష్టి పెట్టండి
- అక్రమ ఇసుక రవాణా, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- కేఎంసీలో వరంగల్ కమిషనరేట్ అధికారుల నేర సమీక్షా సమావేశం



అక్షరదర్బార్, హనుమకొండ : దేశ భవిష్యత్తు అయిన యువత గంజాయి మత్తుకు బానిసలు కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ముఖ్యంగా గంజాయి విక్రయించే మూలాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం కాకతీయ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో ఆయన పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### - గంజాయి విక్రేతలపై ప్రత్యేక నిఘా

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, గంజాయి వినియోగించే వారిని పట్టుకోవడమే కాకుండా, దాన్ని సరఫరా చేసే కీలక వ్యక్తులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వరంగల్‌ను గంజాయి రహిత నగరంగా మార్చడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అధికంగా దొంగతనాలు జరిగే ప్రాంతాల్లో, ముఖ్యంగా శివారు కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ఎంజీఎం హాస్పిటల్, రైల్వే స్టేషన్ పరిసరాల్లో నిఘా పెంచాలి. స్టేషన్ల పరిధిలోని సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేయాలి. పదే పదే నేరాలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లు తెరవాలని సీపీ ఆదేశించారు.

### - అక్రమ దందాలపై కఠినంగా ఉండాలి

అక్రమ ఇసుక రవాణా, రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని సీపీ అధికారులను ఆదేశించారు. పేకాట శిబిరాలపై నిరంతర నిఘా ఉంచాలని, విధుల్లో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్ కేసులు, వారెంట్ల అమలు, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిపై ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, కవిత, శుభంనాగ్, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# న్యాయశాస్త్రంలో బోనాల కిషన్ కు డాక్టరేట్

అక్షరదర్బార్, హనుమకొండ : క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ ఇన్ ఇండియా – ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టూ లా అండ్ స్ట్రాటజీస్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ విట్‌నెస్ అనే అంశంపై పరిశోధన చేసిన బోనాల కిషన్ కు తాజాగా డాక్టరేట్ లభించింది. భారత నేర న్యాయ వ్యవస్థలో సాక్షుల రక్షణకు సంబంధించిన చట్టాలు, వ్యూహాలపై ఆయన లోతైన అధ్యయనం చేశారు. ఈ పరిశోధనను న్యాయ శాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు వై.పద్మజ రాణి పర్యవేక్షణలో ఆయన విజయవంతంగా పూర్తి చేశారు. బోనాల కిషన్ ప్రస్తుతం అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హోదాలో హనుమకొండ కేంద్రంగా టీజీఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ గా పనిచేస్తున్నారు. ఆయన ఒకవైపు కీలకమైన పోలీస్ విధుల్లో ఉంటూనే, మరోవైపు న్యాయ రంగంలో ఇంతటి ఉన్నతమైన పరిశోధనను పూర్తి చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కిషన్ సాధించిన ఈ విజయం పట్ల కాకతీయ విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు అభినందించారు. సాక్షుల రక్షణపై ఆయన చేసిన ఈ పరిశోధన భవిష్యత్తులో న్యాయపరమైన మార్పులకు, పోలీసు వ్యవస్థకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.






## బాధితులకు త్వరితగతిన
# న్యాయం జరగాలి

- ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేయాలి
- విసిబుల్ పోలీసింగ్ తో నేరాల నియంత్రణ
- విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు
- నెలవారి నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి :జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ, మిస్సింగ్ కేసులపై సమగ్రంగా సమీక్షించారు.ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని ఎస్పీ స్పష్టం చేశారు. అత్యాచార, పోక్సో కేసులను నిర్ణీత గడువులో పూర్తిచేసి నిందితులను కోర్టు ముందుకు తీసుకురావాలని ఆదేశించారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సీసీ కెమెరాల వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, సమయానుకూలంగా స్పందించాలని సూచించారు. సమావేశంలో భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



# ఓరుగల్లు గడ్డపై నుంచి 'రుద్రమ' విజయం

- భద్రకాళి బండ్ నుండి మోడల్ రాకెట్ ప్రయోగం సక్సెస్
- వీక్షించిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జిల్లా కలెక్టర్
- విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపిన రాకెట్ ప్రయోగం

అక్షరదర్బార్, హనుమకొండ : ఓరుగల్లు గడ్డపై నుండి తొలిసారిగా మోడల్ రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఏటిడిఆర్ఎల్, కుడా, వరంగల్ ఎన్ఐటి సమన్వయంతో చేపట్టిన ఈ ప్రయోగం భద్రకాళి బండ్ వేదికగా నిలిచింది. శనివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో రుద్రమగా నామకరణం చేసి రాకెట్ ను రూపొందించిన శశాంక్ భూపతి, ఏటిడిఆర్ఎల్ బృందం సభ్యులు భద్రకాళి బండ్ వద్ద నుండి ఈ మోడల్ రాకెట్ ను ప్రయోగించారు. మోడల్ రాకెట్ రుద్రమ వేగంగా ఆకాశం వైపు దూసుకెళ్లింది. హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద నగరమైన చారిత్రక వరంగల్ నగరంలో మోడల్ రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భద్రకాళి బండ్ వద్దకు విద్యార్థులు, యువత, నగరవాసులు చేరుకున్నారు. రాకెట్ ప్రయోగం విజయవంతంగా నింగి వైపు దూసుకెళ్తుండడంతో ఉత్సాహంగా కేరింతలు పెట్టారు. జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా చేపట్టిన రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో సరికొత్త చరిత్రను సృష్టించింది. తొలి దశగా చిన్న మోడల్ రాకెట్ ప్రయోగంగా మొదలుపెట్టిన రాకెట్ ప్రయోగం విజయ తీరాలకు చేరడంతో భవిష్యత్తులో పెద్ద స్వప్నాలకు నాంది పలికింది. రాకెట్ ప్రయోగం కౌంట్ డౌన్, ఆకాశం వైపు రాకెట్ సాగే దృశ్యాలను వీక్షించేందుకు డిజిటల్ స్క్రీన్ ను ఏర్పాటు చేశారు. భద్రకాళి బండ్ పై నిర్వహించిన ప్రయోగంలో రాకెట్ ఒకటి రెండు దశల్లో అద్భుతంగా ఎగిరి నిర్దేశిత ఎత్తును చేరుకోగా మూడో దశలో గాలి దుమారం కారణంగా స్వల్ప సాంకేతిక ఇబ్బంది తలెత్తినప్పటికీ చివరకు మొత్తం ప్రయోగ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది.

### - రాకెట్ ప్రయోగాన్ని వీక్షించిన అతిథులు

భద్రకాళి బండ్ వద్ద మోడల్ రాకెట్ రుద్రమ ప్రయోగాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శేషగిరి రావు, ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా ఫౌండర్ సెక్రటరీ డైరెక్టర్ రఘునందన్ కుమార్, తదితరులు గ్యాలరీ నుండి వీక్షించారు.

# మేడారంలో మంత్రుల పర్యటన

అక్షరదర్బార్, మేడారం : రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శనివారం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో పర్యటించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తో కలిసి వనదేవతలు సమ్మక్క సారలమ్మను దర్శించుకున్నారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు దేవతల గద్దెల చుట్టూ రాతి నిర్మాణాన్ని, గద్దెల చుట్టూ ప్రకారం, ప్రధాన ఆర్చీలను, ప్రహరీ సాండ్ స్టోన్ చిత్రాలను, చుట్టూ డ్రైనేజీ, మీడియా టవర్ లను, గద్దెల చుట్టూ ఉన్న గ్రిల్స్ లను, ఫ్లోరింగ్ పనులను మంత్రులు పరిశీలించారు. తర్వాత మేడారంలోని హరిత హోటల్ లో సంబంధిత శాఖల ఉన్నత అధికారులతో మేడారం అభివృద్ధి పనులపై శ్రీనివాస్ రెడ్డి, సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915